
# సత్యవాక్కు

సంపుటి - 41 జనవరి - 2020 సంచిక - 6



## THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

JANUARY - 2020

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

# LADS to LEADERS

## బాలకుల నుండి పాలకులయ్యే వరకు

## ఇండియా కన్వెన్షన్

## INDIA CONVENTION

సమయం : 2020 : ఫిబ్రవరి 7, 8, 9 తేదీలలో

స్థలము : సత్యవాణి, క్రీస్తు సంఘము, రామారావుపేట, కాకినాడ

క్రీస్తు సంఘములలో యున్న బాలబాలికలను, యువతీ యువకులను, భావితరములకు మంచి నాయకులుగా తీర్చిదిద్దుటకు ఈ కార్యక్రమము ఉద్దేశించబడినది. దేవుని వాక్యములో నైపుణ్యత గల బాలబాలికలకు మంచి బహుమతులు ఇయ్యబడును. ఉచిత భోజన వసతి కల్పించబడును. మీ స్థానిక సంఘములోయున్న బాలబాలికలు, యువకులు హాజరయ్యేటట్లు చూడండి. వివరములకు దిగువ మదహరించిన వారిని సంప్రదించండి.


బ్రదర్. రిక్కీగూటం

సత్యవాణి, కాకినాడ

ఫోన్ : 0884 2363722

98489 98547

# సత్యవాక్యం

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

| సంపుటి - 41 | జనవరి- 2020 | సంచిక -6 |
|---|---|---|


## క్రీస్తు సంఘము యొక్క ప్రత్యేకత

### (Distinctiveness of the Church of Christ )

ఈ లోకమంతయు రకరకాల సంఘములతోను, బోధలతోను నిండి యుండుటవలన, సహృదయత కలిగిన ప్రజలు క్రీస్తు సంఘములో యున్న ప్రత్యేకత యేమిటి? అని అడుగుట సహజమే. చదువరులలో అనేకులు తరుచు మాకు వ్రాయుచున్న ప్రశ్న యిది. క్రీస్తు సంఘములో యున్న ప్రత్యేకత యేమిటి? మనము ఈ ప్రశ్నకు జవాబును కనుగొనుట చాల మంచిది. ప్రతిష్టింపబడిన దాని నుండి లౌకికమైన దానిని, అపవిత్రమైన దానినుండి పవిత్రమైన దానిని వేరు చేయవలెనని లేవీకాండము 10:10లో ఆజ్ఞాపింపబడి యున్నది గనుక క్రీస్తు సంఘములోని ప్రత్యేకత యేమిటో మనము తెలిసికొన వలెను.

మొదటిగా క్రీస్తుసంఘము మొదటి శతాబ్ధపు క్రైస్తవులెట్లు ఆరాధించిరో అట్లే దేవుని ఆరాధించు టకు ప్రయత్నము చేయును.

రకరకాల మానవ కల్పిత సిద్ధాంతముల వలనను, పారంపర్యా చారముల వలనను క్రైస్తవా రాధన కలుషితము చేయబడినది. దాని నుండి

మొదటి శతాబ్దపు పవిత్రత, సూక్ష్మీయత తీసివేయబడినది. అందు వలన "యెహోవా ఈలాగు సెలవిచ్చు చున్నాడు - మార్గములలో నిలిచి చూడుడి, పురాతన మార్గములను గూర్చి విచారించుడి, మేలు కలుగు మార్గమేది అని యడిగి అందులో నడుచు కొనుడి, అప్పుడు మీకు నెమ్మది కలుగును" (యిర్మీయా 6:16). అందువలననే నేటి క్రీస్తు సంఘములు రెండువేల సంవత్సరముల క్రితమున్నట్టి ఆరాధననే అనుసరింతురు. మొదటి శతాబ్దపు క్రీస్తు సంఘముల వలె నేటి క్రీస్తు సంఘములు ఆరాధనలో వాద్యములు లేకుండా పాటలు పాడుదురు, ప్రార్థనచేతురు, వాక్యోపదేశము జరిగింతురు, ప్రతి ఆదివారమున ప్రభురాత్రి భోజనము నాచరింతురు, కానుకల నిత్తురు. దీనికి ఎక్కువగాని తక్కువగాని జరిగించిన యెడల అది ఆత్మతోను, సత్యముతోను కూడిన ఆరాధన కాదు.

క్రీస్తు సంఘము యొక్క విశ్వాస మార్గదర్శి బైబిలు మాత్రమే.

అందు వలన నేటి క్రీస్తు సంఘములు బైబిలు ఎక్కడ మాట్లాడునో అక్కడ మాట్లాడుదురు. బైబిలు ఎక్కడ మౌని యగునో అక్కడ మౌనులగుదురు. బైబిలు సంగతులను బైబిలు పేర్లతో వారు పిలుతురు. వారు చేయు బోధ అంతయు బైబిలుపై ఆధారపడి యుండును. ఏలయనగా "ఒకడు బోధించిన యెడల దైవోక్తులను బోధించు నట్లు బోధింపవలెను" అని 1పేతురు 4:11లో పరిశుద్ధాత్ముడు పలికెను. క్రీస్తుసంఘమునకు యేసు క్రీస్తు యిచ్చిన క్రొత్తనిబంధన తప్ప మానవ లిఖిత ప్రమాణ పుస్తకమేమి యును లేదు.

**క్రీస్తు సంఘ బోధకులు ప్రత్యేకమైనవారు :**

వారు నిష్ప్రయోజనమైన బిరుదుల నేమియును తగిలించు కొనరు. వారు రెవరెండ్లుగాని, పాస్టర్లు గాని, ఫాదర్లుగాని కారు. ఈ బిరుదులు లేఖన విరుద్ధమైనవి. మానవ

కల్పితములైనవి గనుక క్రీస్తు సంఘస్థులు వాటిని లెక్కచేయరు. యేసుక్రీస్తు యిట్లు బోధించెను : "భూమి మీద ఎవనికైనను తండ్రి అని పేరు పెట్టవద్దు; ఒక్కడే మీ తండ్రి; ఆయన పరలోకమందున్నాడు. మరియు మీరు గురువులని పిలువ బడవద్దు; క్రీస్తు ఒక్కడే మీ గురువు. మీలో అందరికంటే గొప్పవాడు మీకు పరిచారకుడై యుండవలెను. తన్ను తాను హెచ్చించు కొనువాడు తగ్గింప బడును; తన్ను తాను తగ్గించుకొను వాడు హెచ్చింపబడును" (మత్తయి 23:9-12). క్రీస్తు సంఘబోధకులు సంఘ సభ్యులకంటె మిన్నయైన వారు కారు. సంఘములో అందరూ సమానులే, సువార్తికుడు సంఘ యజమాని కాదు. వాక్యమును ప్రకటించుటయే అతని ముఖ్యవిధి. అతడు చేయు బోధ అంతయు బైబిలు ప్రకారముండును. అతి సులువుగా దేవుని సత్యమును ప్రజలు గ్రహించు నట్లు వాక్యములో ఉన్నది ఉన్నట్లుగా అతడు బోధించును.

క్రీస్తుసంఘం నిర్మాణ పద్ధతి ప్రత్యేకమైనది.

ఆ నిర్మాణ పద్ధతి స్థానికమైనది. ప్రతి స్థానిక క్రీస్తు సంఘము క్రీస్తునందు దానికదే స్వతంత్రత కలిగి యున్నది. కొన్ని స్థానిక సంఘములపై ఒక యజమానిగాని, మరొక సంఘము గాని, లేక ఒక స్థానిక సంఘముపై మరొక సంఘము అధికారము కలిగియుండుట గాని కొత్త నిబంధన సంఘ నిర్మాణమునకు వ్యతిరేకమైనది. సార్వజనిక క్రీస్తుసంఘమునకు, ప్రతి స్థానిక సంఘమునకు శిరస్సు క్రీస్తే గాని యేమానవుడును కాదు. ప్రతి స్థానిక సంఘము పెద్దలను, పరిచారకు లను, బోధకులను, ఉపదేశకులను, సభ్యులను కలిగియుండును. ఆయా పదవులు సంఘములో వారు చేయు పనిని సూచించుటకు బైబిలులో వాడబడిన పదములేగాని అవి బిరుదులు కావు. లేఖనముల ప్రకారమైన అర్హతలు కలిగినవారే ఆయా పనులు నిర్వర్తించుటకు

నియమింపబడుదురు.

**క్రీస్తు సంఘము ఒక డినామి నేషన్ కాదు.**

అది క్రొత్తనిబంధనలో మనకు కనబడు సంఘమై యున్నది. అది ఆదిమ సంఘమునుండి వీడి పోయిన ఒక శాఖ కాదు, గాని ఈ 20వ శతాబ్ధములో పునరుద్ధరింప బడిన ఆదిమ సంఘమై యున్నది. అపొస్తలులు ఏ సంఘసభ్యులు? అట్లే ఎఫెసీయులు, కొరింథీయులు, గలతీయులు ఏసంఘసభ్యులు? వారే సంఘ సభ్యులో మేముకూడ అదే సంఘ సభ్యులము. విత్తనము దేవుని వాక్యమని యేసు బోధించెను (లూకా 8:11). దేవుని వాక్యము విత్తబడగా ఆనాడు ప్రజలు దానిని విని విశ్వసించి విధేయులై క్రైస్తవులైరి. క్రీస్తు సంఘ సభ్యులయిరి. అట్లే నేడుకూడాను; దేవుని వాక్యమనే విత్తనమును విత్తుచుండగా ప్రజలు విని విశ్వసించి విధేయులై క్రైస్తవులగుచున్నారు. క్రీస్తు సంఘసభ్యులగుచున్నారు. మొదటి శతాబ్ధములో క్రీస్తు స్థాపించిన సంఘమే ఈనాడు కూడ యున్నది. మొదటి శతాబ్ధములో వారివలెనే నీవుకూడా క్రీస్తు సంఘస్థుడవు కాగలవు.

**క్రీస్తు సంఘసభ్యులు ప్రత్యేకమైన వారు.**

వారు ఫలానిరకమైన క్రైస్తవులు కాదు గాని వారు క్రైస్తవులు మాత్రమే. వారు ప్రొటెస్టాంటులు కాదు, కేథలిక్కులు కాదు గాని వారు క్రైస్తవులు మాత్రమే. వారు చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి పిలిచిన యేసుక్రీస్తు యొక్క గుణాతిశయములను ప్రచురముచేయు నిమిత్తము ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధ జనమును, దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు (1పేతురు 2:9). వారు క్రీస్తుకొరకు పనిచేయుదురు, యితరులకు సహాయము చేయుదురు, వినయ విధేయతలతో దేవుని పరిచర్య చేయుదురు.

ఏదైనా విలువైన సొత్తు ఎక్కడ యున్నదో దానిననుకరించి చేయబడిన

నకిలీ సొత్తుకూడా యుండును. అట్లే ప్రభువు సంఘమును గూర్చి కూడాను. అనేకులు ప్రభువు సంఘము కాకయే ప్రభువు సంఘమని చెప్పుకొను వారున్నారు. అట్టివారి క్రియలను బోధలను దేవుని వాక్యముతో సరిపోల్చి చూడుము. అట్లే అనేకులు మేము క్రీస్తు సంఘసభ్యులమనియు, బోధకుల మనియు చెప్పుకొనుచు తమ జీవితము లోను, బోధలోను పవిత్రత లేనివారుగా యున్నారు. అట్టివారు నకిలీ సొత్తని గమనించి విసర్జించుము. అట్టివారు తమ్మును కొనిన ప్రభువునుకూడ విసర్జించుచు, తమకు తామే శీఘ్రము గా నాశనము కలుగజేసికొనుచు, నాశనకరమైన భిన్నాభిప్రాయములను బోధింతురు. వారి పోకిరి చేష్టవలన సత్యమార్గము దూషింపబడునని లేఖ నములు బోధించు చున్నవి (2పేతురు 2:1-2). అయితే అట్టి వారిని గూర్చి నీవు అభ్యంతరపడక సత్యమును అన్వేషించుము. క్రీస్తును వెదకుము, ఆయన నీకు దొరుకును. ఆయన యందు విశ్వాసముంచుము. నీ పాపముల విషయమై మారుమనస్సు పొందుము. క్రీస్తు నామమును మనుష్యుల యెదుట ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. ప్రభువు నిన్ను తన సొత్తుగా చేసికొని తన సంఘమందు చేర్చును.


మీరు సత్యవాక్కు సాలు చందాకట్టారా? లేని యెడల ఇప్పుడే రూ.50/-లు ఎమ్.ఒ. చేసి మీ సభ్యత్వమును కొనసాగించు కొనండి.

సత్యవాణి

**7-9-35, సాంబమూర్తి వీధి, కాకినాడ - 533 004.**

# క్రీస్తు సంఘమును ఎవరు స్థాపించిరి?

## (Who was the Founder of the Church? )

క్రీ.శ. 33వ సంవత్సరములో యేసుక్రీస్తు పెంతెకొస్తు దినమున క్రీస్తు సంఘమును స్థాపించెను. అది ఆదివారము. అది యెరూషలేము పట్టణములో స్థాపించబడెను (మత్తయి 16:18; అపో.కా. 2:1-47). యిది జగత్పునాది వేయబడకముందే సంకల్పించబడెను (ఎఫెసీ 3:8-11). మానవ చరిత్రలో నాలుగు సహస్రాబ్ద ముల తరువాత అది స్థాపించబడెను (ఆది.కా. 3:15). అది ప్రవక్తల ప్రవచ నములను నెరవేర్చెను (యెషయా 2:2-4).

క్రీస్తుసంఘము నిత్యము వుండు టకు ఉద్దేశించబడెను (దానియేలు 2: 44; హెబ్రీ 12:28). అది సార్వజనిక మైనది. దేవుని స్వరూపమున చేయబడిన ప్రతి వానికి అందులో స్థానమున్నది. అది పరిపూర్ణమైనది. ఎన్నడు సవరణ చేయబడే అవుసరం దానికి లేదు. దానిని మనం అభివృద్ధి చేయలేము.

స్థాపకుడు, నిర్మాణకుడు, కొన్నవాడు, యజమాని ఆయనే

నజరేయుడైన యేసు యూదయ బెత్లేహేములో క్రీ.పూ. 1వ సంవత్సర ములో జన్మించెను. ఆయన పరిశుద్ధాత్మ అద్భుతము వలన కన్యయైన మరియకు జన్మించారు. ఆయన ఐగుప్తులోను, యూదయలోని నజరేతు లోను పెరిగారు. ఆయన బోధను అద్భుతములను ఎక్కువగా గలిలయలో చేసెను. ఆయన క్రీ.శ.33లో ఏప్రియల్ నెలలో యెరూషలేము వెలుపలయున్న కల్వరికొండపై పొంతి పిలాతు యూదయకు అధిపతిగా యున్న సమయంలో మరణించారు. యూదుల యొక్కయు రోమీయుల యొక్కయు న్యాయస్థానము ఆయనకు మరణశిక్షవేయగా రోమాసైనికులు ఆయనను సిలువవేసి చంపిరి.

సంఘమును స్థాపించుటకు యేసుకొక్కడికే అవకాశముండెను,

ఏలయనగా ఆయన మెస్సీయ, దేవుని కుమారుడు, దైవావతారుడు (యోహాను 1:14), పాపరహిత జీవితము వలన ఆయన దేవుడని నిరూపించుకొనెను (హెబ్రీ 7:26). ఆయన నెరవేర్చిన ప్రవచనములు (మత్తయి 27:9,35; యోహాను 5:39) మరియు ఆయన చేసిన అద్భుతములు ఆయన దేవుడని నిరూపించెను. క్రొత్తనిబంధనలోని నాలుగు సువార్తలలోను ఆయన చేసిన 34 అద్భుతములు లిఖించబడ్డాయి. ఆయన రోగులను బాగుచేసారు, నీళ్ల మీద నడిచారు, సముద్రమును, [illegible] గద్దించి నిమ్మళపరిచారు, నీళ్లను ద్రాక్షారసముగా మార్చారు, వేల కొలది ప్రజలకు అద్భుతరీతిగ ఆహారము పెట్టారు, చనిపోయిన వారిని సజీవులుగా లేపారు. ఆయనే చనిపోయి తిరిగిలేచారు.

ఆయన చేసిన పనులద్వారా ఆయన దేవుడని నిరూపించుకొన్నారు. ఆయన లోకమునకు వచ్చియుండక పోతే ఆయన సంఘము వుండదు. ఆయన దేవుని కుమారుడు కాకపోతే ఆయన సంఘము మోసకరమైనదగును.

**క్రీస్తు సంఘమునకు నిర్మాణకుడు :**

ఆయనే దాని నమూనాను తయారు చేసారు. తన రాజ్యమైన సంఘమును గూర్చి బోధించుచు ఆయన మూడు సంవత్సరములు గడిపారు. దాని స్థలాన్ని సమయాన్ని ఆయనే ఎంపిక చేసారు. యెరూషలేము లో ఆయన పునరుత్థానము తరువాత మొదటి పెంతెకొస్తు నాడు అది స్థాపించ బడెను (అపొ.కా. 2).

**క్రీస్తు సంఘమును కొన్నారు (అపొ.కా. 20:28) :**

పస్కాపండుగనాడు రోమా సైనికులు, జనసముహము ఇస్కరి యోతు యూదా నడిపింపులో ఆయన పైకివచ్చి ఆయనను బంధించారు. వారాయనను పట్టుకొని అక్రమతీర్పు తీర్చి సిలువ వేసి చంపారు.

యేసే అఘోరమైన సిలువలో 6 గంటలసేపు వ్రేలాడుచు చివరకు ప్రాణము విడిచారు. ఆయన

శరీరమును అరిమతయి యోసేపు అనువాని సమాధిలో పాతిపెట్టిరి గాని మూడవ దినమున ఆయన చెప్పినట్లే మరణమును జయించి తిరిగిలేచారు (మత్తయి 20:18,19). ఆయన సమాధి నుండి లేచిన నలుబది దినముల తరువాత ఆయన మీరు సర్వ లోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి యని అజ్ఞ యిచ్చారు (మార్కు 16:15,16). తదుపరి ఆయన పరమునకారోహణుడై తండ్రి యొక్క కుడిపార్శ్వమున ఆశీనుడయ్యారు (అపో.కా. 1:9-11).

## క్రీస్తు సంఘమునకు స్థాపకుడు :

ఒక వడ్రంగి కుమారుడైన యేసు లోకములోయున్న వారందరి కంటే గొప్ప నిర్మాణకుడు. ఆయన సంఘమును తానే నిర్మించారు. ఆయన ఒక మహిమగల దేవాలయమును నిర్మించునని జెకర్యా ముందుగనే ప్రవచించాడు (జెకర్యా 6:11-13). యేసు సంఘమును "అపొస్తులులును ప్రవక్తల మీదను పునాది వేసి నిర్మించారు" (ఎఫెసీ 2:20).

## క్రీస్తు సంఘమునకు యజమాని క్రీస్తే

యేసు సంఘమును స్థాపించి మనుష్యులకు విడిచిపెట్టి పోలేదు. ఆయన తన రాజ్యమైన సంఘము పై నిరంతరము ఒక రాజుగా నిలిచే యున్నారు. ఆయన తన ఆలయములో ప్రధానయాజకుడు.

యేసు సంఘమును పరిపూర్ణతకు నడిపించు చున్నారు (ఎఫెసీ 5:25 -27). దేవాలయ నిర్మాణము పూర్తి అయిన తరువాత దేవుడు దానిలో ప్రవేశించారు (1 రాజులు 8:10,11). సంఘము పరిపూర్ణతసాధించినప్పుడు దానిలోనికి దేవుడు ప్రవేశించును (1 కొరింధి 15:24).

-ఎలన్ వెబ్‌స్టర్

# సంఘముల స్థాపన చరిత్ర

## (History of the Churches)

| ఏ సంఘము | ఎప్పుడు | ఎవరిచే | ఎక్కడ |
|---|---|---|---|
| క్రీస్తు సంఘము | కీ.శ.33 | క్రీస్తుచే | యెరూషలేము |
| రోమన్ కేథలిక్స్ | 606లో | బోనిఫేస్-3 | రోమాలో |
| ఆర్థోడాక్స్ | 1054లో | మైకల్‌సెరూలాలూ | కాన్స్టేంటినోపిల్ |
| లూథరన్ | 1517 | జెర్మనీ | మార్టిన్‌లూథర్ |
| స్విస్‌రిఫర్మేషన్ | 1523 | జ్వింగ్లీ | స్విట్జర్లాండ్ |
| మెన్నోనైట్స్ | 1525 | మెన్నోసైమన్ | స్విట్జర్లాండ్ |
| ఆంగ్లికన్ | 1534 | హెన్రీచక్రవర్తి | ఇంగ్లాండు |
| కేల్వినిజమ్ | 1536 | జాన్‌కేల్విన్ | స్విట్జర్లాండ్ |
| ప్రెస్బిటేరియన్ | 1560 | జాన్‌నాక్స్ | స్కాట్లాండ్ |
| బాప్టిస్టు | 1607 | జాన్‌స్మిత్ | హాలేండ్ |
| డచ్‌రిఫార్మ్‌డ్ | 1628 | మైకేలిస్‌జోన్స్ | నెదర్లాండ్ |
| ఏమిష్ | 1693 | జేకబ్‌అమ్మాన్ | స్విట్జర్లాండ్ |
| మెథడిస్టు | 1739 | జాన్‌వెస్లీ | ఇంగ్లాండ్ |
| క్వేకర్ | 1647 | జార్జ్‌ఫాక్స్ | జర్మనీ |
| మొరావియన్స్ | 1727 | కేంట్‌జినెన్‌డోర్ఫ్ | స్వీడన్ |
| కాంగ్రిగేషనల్ | 1744 | చార్ల్స్‌వెస్లీ | ఇంగ్లాండ్ |
| స్వీడెన్‌బోర్గ్ | 1747 | ఇమ్మాన్యుల్ స్వీడన్‌బోర్గ్ | స్వీడన్ |

| ఏ సంఘము | ఎప్పుడు | ఎవరిచే | ఎక్కడ |
|---|---|---|---|
| బ్రదరన్ | 1828 | జాన్‌డార్బి | ఇంగ్లాండ్ |
| లేటర్‌డేసెయింట్స్ | 1830 | జోసఫ్‌స్మిత్ | న్యూయార్క్ అమెరికా |
| సాల్వేషన్‌ఆర్మీ | 1865 | విలియంబూత్ | ఇంగ్లాండ్ |
| సెవెంతుడే | 1860 | ఎలెన్‌జి.వైట్ | న్యూహేంప్‌షైర్, అమెరికా |
| యెహోవాసాక్షులు | 1870 | చార్ల్స్‌రస్సల్ | పెనిసిల్వేనియా అమెరికా |
| క్రిష్టియన్‌సైన్స్ | 1879 | మేరీబేకర్‌ఎడ్డీ | న్యూహేంప్‌షైర్, అమెరికా |
| పెంతెకోస్టల్ | 1900 | చార్ల్స్‌పార్థమ్ | కేలిఫోర్నియా అమెరికా |
| చర్చి ఆఫ్ గాడ్ | 1933-47 | హెచ్.డబ్ల్యు ఆర్మ్‌స్ట్రాంగ్ | ఓరెగన్ అమెరికా |
| యూనిఫికేషన్ | 1954 | సర్‌మయూంగ్‌మూన్ | దక్షిణకొరియా |
| బైబిలు మిషన్ | 1954 | దేవదాసయ్య | ఆంధ్రప్రదేశ్, ఇండియా |

క్రీస్తుస్థాపించిన ఒకే ఒక్క సంఘము తప్ప మిగతావన్నీ మానవకల్పితములే. రక్షణక్రీస్తులోను ఆయన సంఘములోను మాత్రమే యున్నది.. మిగతావన్నీ వ్యర్థమే (మత్తయి 15:13,14).

# క్రీస్తుతో పైకి
## ( Up with Christ )

క్రీస్తు పైకెత్తబడెను : (యోహాను 12:32,33). తాను సిలువ పై మరణించబోవుచున్నట్లు యేసు సూచించెను. "నేను భూమిమీద నుండి పైకెత్తబడినప్పుడు అందరినీ నా యొద్ద కు ఆకర్షించుకొందును". ఆయన ఎట్లు చనిపోబోవుచున్నాడో ముందుగనే యేసు ప్రభువుచెప్పి నందున మన కొరకు మరణించడానికి ఆయన ఇష్ట పూర్వకముగా సంసిద్ధుడాయెను (యోహాను 10:17,18).

అరణ్యములో మోషే ఇత్తడి సర్పమును పైకెత్తెను. మరణకరమైన పాముకాటుకు లోనైన వారు బ్రదకాలంటే వారా సర్పమువైపు చూడవలెను. అట్లే పాపము నుండి మనం విముక్తి పొందాలంటే క్రీస్తువైపు చూడవలెను (యోహాను 3:14-16; సంఖ్యా 21: 4-9; హెబ్రీ 12:1,2).

క్రీస్తులేపబడెను : (అపో.కా.2 :22-24). మరణము ఆయనను బంధించి యుంచలేనందున దేవుడు యేసును మరణ బంధకముల నుండి లేపెను (1కొరింధి 15:17). క్రీస్తు లేపబడి యుండకపోతే మన విశ్వాసము వ్యర్థమే. సువార్త ప్రకటించుట వ్యర్థమే (1 కొరింధి 15:14). మనలను రక్షించు సువార్తలో క్రీస్తు యొక్క మరణము, సమాధి, పునరుత్థానము ఇమిడియున్నవి (1 కొరింధి 15:1-4).

మృతులలో నుండి యేసు లేచి నందున ఆయన మహిమా ప్రభావము లతో దేవుని కుమారుడని నిరూపింప బడెను (రోమా 1:1-7). యేసు చని పోయి మరల సజీవునిగా లేచినందున మరణముపై ఆయనకు అధికార మున్నది, మరణ బంధకములతో పీడింప బడినవారందరి పై ఆయనకు అధికార మున్నది (ప్రకటన 1:17,18; యోహాను 5:28,29).

యేసుక్రీస్తు దేవుని మహిమ వలన మరణము నుండి తిరిగి లేచెను. మనం రక్షించబడవలెనంటే మనం ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్యమందును పాలుపొందవలెను (రోమా 6:4).

క్రీస్తు పైకి కొనిపోబడెను : (అపో.కా.1:9). ఆయన పునరుత్థానుడైన తరువాత యేసు పరలోకమునకు కొనిపోబడెను. ఆయన ఆకాశమేఘారూఢుడై ఆరోహణుడు కాగా పరలోకమందు రాజ్యాధికారము పొంది సింహాసనాసీనుడాయెను (దానియేలు 7:13,14).

ఆయన భూలోకమును విడిచిన తరువాత మాత్రమే పరిశుద్ధాత్మని పంపెను. ఆయన ఆత్మావేశము గల వాక్యమునను గ్రహించెను (యోహాను 16:7,13).

ఆయన పరలోకమునుకు వెళ్లినందున యేసు ఇప్పుడు సంఘము యొక్క శిరస్సుగా పాలించుచున్నారు. సంఘములో యుంటేనే మనకు రక్షణ యున్నది (ఎఫెసీ 1:20-23).

## ప్రసిద్ధిచెందిన సుంకపు గుత్తదారుడు

### ( Famous Tax Collector)

లూకా 19:1-20 బాల్యము నుండి జక్కయ్య యొక్క కధను మనము ఎరిగి యున్నాము. మన బిడ్డలకు కూడా దీనిని కధ రూపంలో చెబుతాము. యేసుప్రభువు, ఆయన శిష్యులు యెరూషలేముకు ప్రయాణం చేస్తున్నారు. (ఆఖరిసారిగా) వారు అందమైన ఈ యెరికో పట్టణం గుండా వెళ్తున్నారు. దేవాలయములో వారికి బాధ్యతలేమి లేనపుడు పూజారులు వచ్చి ఈ పట్టణంలో నివసిస్తారు. మొదటిసారిగా మనం ఈ పట్టణమును గురించి యెహోషువ 6వ అధ్యాయంలో ఇశ్రాయేలీయులు దానిని పడగొట్టుటను గురించి చూస్తాము.

## యెరికో పట్టణం

అది శపింపబడిన పట్టణం, గాని ఇశ్రాయేలీయుల రాజులలో దుష్టుడైన అహాబు దీనిని తిరిగి కట్టాడు (1 రాజులు 16:24). ఈ రోజు ఆ పాతదైన యెరికో పట్టణము లేదు.

ఇపుడు మనం చూస్తున్న ఈ జక్కయ్య ప్రసిద్ధిచెందినవాడు, ధనికుడు, సుంకపు గుత్తదారుల అధిపతి. క్రొత్తనిబంధన గ్రంథములో మనము మరొక ఇద్దరు సుంకపు గుత్తదారులను గూర్చి చూస్తాము. అపొస్తులుడైన మత్తయి తనకున్నదంతా విడిచి యేసుప్రభుని శిష్యుడయ్యాడు (మత్తయి 9:9). తన దీన ప్రార్ధన అంగీకరింపబడి నీతిమంతునిగా తీర్చబడి ఇంటికి వెళ్లిన మరొక సుంకపు గుత్తదారుని గురించి చదువుతాము (లూకా 18:14).

## యేసును గోరినవారు

లూకా 9:3 "అతడు యేసును చూడగోరెను". యేసుప్రభువు వారు భూమి పై నున్నపుడు అనేకమంది రకరకాల కారణాలవల్ల యేసుప్రభును చూడాలనుకొనేవారు. తూర్పుదేశపు జ్ఞానులు రాజైన యేసయ్యను ఆరాధించడానికి యెరూషలేమునకు వచ్చారు (మత్తయి 2:1-6). ప్రభువైన యేసును చూచువరకు అతడు మరణించడు అని సుమెయోనుకు పరిశుద్ధాత్మ తెలియచేసినందువల్ల అతడు కూడ యేసుప్రభును చూడాలనుకుంటున్నాడు. బాలుడైన యేసయ్యను చూచుటకు గొర్రెల కాపరులు బెత్లెహేమునకు వచ్చారు (లూకా 2:25-35). గ్రీసు దేశస్థులు కొందరు యేసయ్యను చూడాలని ఆశించారు (యోహాను 12:20).

హేరోదు రాజు యేసు ప్రభువును చూడాలనుకున్నాడు. "హేరోదు యేసును చూచి మిక్కిలి సంతోషించెను. ఆయనను గూర్చి చాలా సంగతులు విన్నందున ఆయన ఏదైనను ఒక సూచక క్రియ చేయగా నిరీక్షించి, బహుకాలము నుండి ఆయనను చూడగోరెను" (లూకా 23:8). ఆయన ఎక్కడకు వెళ్లినను

అనేక జనసమూహములు ఆయనను వెంబడించుచూ నుండెను. వారందరు యేసయ్యను చూడాలని ఎందుకు అసక్తి కలిగి ఉన్నారు? వారు ఆయన బోధను గురించి, ఆయన చేస్తున్న అద్భుతాలను గురించి, రోగులను స్వస్థపరుచుటను గురించి విన్నారు. దయ్యాలను వెళ్ల గొట్టారు. వేలమందికి ఆహారం పెట్టారు, నీళ్ళమీద నడిచారు, తుఫాను ను అణచారు. ఇవన్నీ చేసారు గనుక జక్కయ్య కూడా యేసు ప్రభువును గురించి చాలా విషయాలు విన్నాడు. ఇటీవలనే యేసుప్రభువు యెరికోకు చెందిన ఒక గ్రుడ్డివానిని స్వస్థపరిచారు (లూకా 18:35-43).

జక్కయ్య యేసయ్యను చూడాలనుకున్నాడు గాని ఆయనను చూడడానికి అతనికి ఆటంకాలున్నాయి 1. అతడు పొట్టివాడు 2. జన సమూహాలు చాల ఎక్కువ ఉన్నారు. అతడు ఈ ఆటంకములను ఎట్లు అధిగమించాడో దేవుని వాక్య చెబుతుంది. "అతడు ముందుగా పరుగెత్తి ఆయనను చూచుటకు ఒక మేడిచెట్టెక్కెను (లూకా 19:4). "మనసు ఉంటే మార్గం ఉంటుందనే" ఒక సామెత తన అసమర్థతను జయించుటకు గాను అతడు మేడి చెట్టు ఎక్కి యేసుప్రభువును చూచాడు.

మన పరలోకపు తండ్రి తన పిల్లలందరూ ఆయన వద్దకు రావాలని ఆశిస్తారు. "దప్పిగొనిన వారలారా నీళ్ల యొద్దకు రండి, రూకలు లేనివారలారా, మీరు వచ్చికొని భోజనము చేయుడి. రండి రూకలు లేకపోయినను ఏమియు నియ్యకయే ద్రాక్షారసమును పాలను కొనుడి"...(6వ). యెహోవా మీకు దొరకు కాలమునందు ఆయనను వెదకుడి. ఆయన సమీపములో ఉండగా ఆయనను వేడుకొనుడి (యెష 55:1-6). యేసు ప్రభువు ఇట్లు చెప్పారు : ప్రయాస పడి భారు మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి కలుగజేతును" (మత్తయి 11:28). "దేవుని యొద్దకు రండి అప్పుడాయన మీ యొద్దకు వచ్చును" (యాకోబు 4:7). "ఆత్మయు, పెండ్లికుమార్తెయు రమ్ము అని చెప్పుచున్నారు,

వినువాడును రమ్ము అని చెప్పవలెను, దప్పిగొనిన వానిని రానిమ్ము, ఇచ్ఛయించు వానిని జీవజలమును ఉచితముగా పుచ్చుకొననిమ్ము (ప్రకటన 22:17).

**యేసుకు నీ పేరు తెలుసు :**

యేసు ప్రభువు జక్కయ్యతో, "జక్కయ్యా త్వరగా దిగుము"...(లూకా 19:5) అన్నారు. యేసుప్రభునకు తన పేరు తెలియదని, ఆ సమూహంలో ఆయన తనను గుర్తించలేరని జక్కయ్య తలంచి ఉండవచ్చు. గాని యేసయ్యకు ప్రతివ్యక్తి యొక్క పేరు తెలుసు, వారి హృదయాలు కూడా చివరి వరకు తెలుసు. ప్రభువైన దేవుడు ఇట్లు అంటున్నారు: "నా సేవకుడైన యాకోబు నిమిత్తము నేను నీకు పేరుపెట్టి పిలిచితిని, నీవు నన్ను ఎరుగకుండినప్పటికిని నీకు బిరుదు ఇచ్చితిని" (యెషయా 45:4). "అయితే యాకోబు, నిన్ను సృజించిన వాడగు యెహోవా, ఇశ్రాయేలూ నిన్ను నిర్మించిన వాడు...భయపడకుము, పేరుపెట్టి నిన్ను పిలిచియున్నాను, నీవు నా సొత్తు" (యెషయా 43:1).

ఆకాశ మందలి లెక్కింపలేని నక్షత్రములను కూడా దేవుడు ఎరిగియున్నారు.

ఆయన వాటిని వాటి ఆ పేర్లతో పిలుస్తారు (కీర్తన 147:4, యెషయా 40:26). ప్రతి వ్యక్తిని గురించిన ప్రతి విషయము ఆయనకు తెలియును. కీర్తనాకారుడు ఇలా వ్రాస్తున్నాడు. "యెహోవా, నీవు నన్ను పరిశోధించి తెలిసికొని యున్నావు. నేనుకూర్చుం డుట, నేను లేచుట నీకు తెలియును, నాకు తలంపు పుట్టక మునుపే నీవు నా మనస్సును గ్రహించుచున్నావు. నా నడకను, నా పడకను నీవు పరిశీలన చేసియున్నావు. నా చర్యలన్నిటిని నీవు బాగుగా తెలిసికొనియున్నావు" (కీర్తన 139:1-3). యేసుప్రభువు జక్కయ్య హృదయాన్ని పరిశోధించారు. అతడు కూర్చుండుట లేచుట, పరుండుట అతని చర్యలన్నీ దూరమునుండే బాగుగా ఎరిగియున్నారు. ఆయనకు మన పేర్లు తెలుసు, మన చర్యలన్నీ తెలుసు, మన తలంపులన్నీ అర్థం చేసి

కోగలరు.

**జక్కయ్య ఇంటికి రక్షణ :**

యేసుప్రభువు జక్కయ్యతో అన్నారు–"జక్కయ్య త్వరగా దిగుము, నేడు నేను నీ ఇంట ఉండవలసి యున్నది" అని (5వ). జక్కయ్య ఎంతో ఆనందంతో యేసయ్యను తన ఇంట చేర్చుకున్నాడు. యేసయ్య మన ఇంటిలో ఉండు లాంటి పరిస్థితిలో మన గృహం ఉన్నదా? ఒకసారి యేసు ప్రభువు పేతురు ఇంటిలో ప్రవేశించి అతని అత్తను స్వస్థపరిచారు. ఆమె స్వస్థపడిన వెంటనే యేసుప్రభువునకు పరిచర్యచేసింది (మత్తయి 8 :14,15). ఆయన యాయీరు ఇంటిలో ప్రవేశించి మరణించిన అతని కుమార్తెను తిరిగి బ్రతికించారు (మార్కు 5:35). ఆయన మార్త, మరియ ఇంటిలో ప్రవేశించి వారికి బోధించారు (లూకా 10:38). మన జీవితంలో ఆయనకు ప్రధమ స్థానము ఇచ్చినట్లయితే ఆయన మన ఇంటిలో కూడా నివసిస్తారు. ఆయనతో మనకు మంచి సంబంధం కలిగి ఉండాలి అంటే ప్రార్ధన ద్వారా క్రమంగా ఆయనతో మాట్లాడుచు ఉండాలి. మార్త మరియల వలె ఆయన వాక్యం మనతో మాట్లాడుతూ ఉన్నపుడు ఆయనను వినాలి. "నీతిమంతుల గుడారములలో రక్షణను గూర్చిన ఉత్సాహసునాదము వినబడును" (కీర్తన 118:15) అని కీర్తనాకారుడు వ్రాసాడు.

**ఆటంకములను అధిగమించాలి**

జక్కయ్య ధనికుడు, ఉన్నత స్థాయిలో ఉన్నవాడు అయినప్పటికి వీధిలో పరుగెత్తి మేడిచెట్టు ఎక్కాడు. మనము కూడ యేసుప్రభువునకు మనకు మధ్యగా వచ్చే ఆటంకములను అధిగమించాలి. యేసుప్రభువును మన జీవితంలోనికి ఆనందముగా చేర్చు కొనుటకు మనం సిద్ధపడి ఉండాలి.

**ఇచ్చుటలో ఆసక్తి**

ఆఖరిగా జక్కయ్య తన ఆస్థిలో సగభాగము బీదలకిచ్చుటకు ముందుకు వచ్చాడు. మత్తయి 19:16–22, మార్కు 10:17–22, లూకా 18:18–25లలో ధనికుడైన ఒక యౌవన అధికారిని గురించి

చదువుతాము. నిత్యజీవము పొందుటకు అతనికి కాంక్ష ఉంది. గాని యేసుప్రభువు చెప్పినట్టుగా తన ఆస్థిని ఇతరులకిచ్చుటకు అంగీకరించ లేదు. యేసుప్రభువు "నీ ధనమెక్కడ ఉండునో అక్కడనే నీ హృదయము ఉండును" అని చెప్పారు (మత్తయి 6:21,24; లూకా 12:15; ఎఫెసీ 5:3, కొలస్సీ 3:5; 1తిమోతి 6:6).

ఎవడును ఇద్దరు యజమానులను సేవించలేడు, నీవు దేవునిని ధనాన్ని ఒకేసారి సేవించలేవు. అది సంఘము లోని క్రైస్తవులు (బర్నబాతి సహో) అందరు తమ తమ ఆస్తులను అమ్మి సంఘ పరిచర్య నిమిత్తము అపొస్తులు లకు ఇచ్చారు. అపొస్తులలు తమ ఆస్తులను విడిచి యేసుప్రభువును వెంబడించారు (లూకా 18:28-30).

జక్కయ్య యేసయ్యను గురించి విని ఆయన యందు విశ్వాసముంచారు. "నేనెవని యెద్దనైనను అన్యాయముగా దేనినైనను తీసికొనిన యెడల అతనికి నాలుగంతలు మరల చెల్లింతును" అనిన అతని మాటలు అతనిలోని పశ్చాత్తాపమును చూపుచున్నవి. యేసుప్రభువు - "నేడు ఈ ఇంటికి రక్షణ వచ్చి యున్నది" అని చెప్పారు.

పాపములను క్షమించుటకు యేసుప్రభువునకు అధికారమున్నది. శిలువ పై నున్న దొంగ పరదైసులోనికి రావడానికి ఆయన అనుమతించారు. "ఆయన సంపూర్ణ సిద్ధి పొందినవాడై... తనకు విధేయులైన వారికందరికిని నిత్య రక్షణకు కారకుడాయెను" అని హెబ్రీ గ్రంథ కర్త అంటున్నారు (హెబ్రీ 5:8). ఈ కృపాకాలములో ఆయన ఆజ్ఞలకు లోబడుటవల్ల మనము రక్షణ పొందుచున్నాము.

-కబితా గూటం


సత్యవాణి రేడియో కార్యక్రమములను ఇంటర్నెట్‌లో వినండి.

దిగువ లింకును క్లిక్ చేయండి

http/radio.truth.fm:8000/telugu

# అన్నదమ్ములలో జగడములు పుట్టించువాడు

## ( He who Soweth Discord among Brethren )

ఈమధ్య నేను టీచర్స్ ట్రైయినింగ్ వర్క్‌షాప్ ఒకటి హాజరయ్యాను. దానిలో క్లాస్‌రూమ్ మేనేజ్‌మెంటును గూర్చి శిక్షణ యిచ్చారు. ప్రతి విద్యార్థిలోను నిర్మాణాత్మక భావములు కల్పించునట్లు వారికి శిక్షణ ఇయ్యాలని అందులో తెలియజేసారు. ప్రతి విద్యార్థి మనస్సులో ప్రోత్సాహకరమైన భావములు కల్పించాలనునది ఒక ప్రాముఖ్యాంశము. తద్వారా వారు మంచి వ్యక్తులుగా విజయవంతమైన జీవితాన్ని జీవిస్తారు.

ఈ వ్యాసము యొక్క టైటిల్ పైనేను కేంద్రీకరించినప్పుడు పై శిక్షణ కార్యక్రమములో నేనునేర్చుకొన్న దానికిని సామెతలు 6:19లో చెప్పబడిన దానికిని సంబంధమున్నట్లు గమనించాను. యితరుల మనస్సులో కావాలని ఏదో ఒకటి నాటుట. అయితే ఆ నాటేది ఏమిటో అను విషయంలో గొప్ప వ్యత్యాస మున్నది.

సామెతలు 6:19లో యెహోవాకు అసహ్యములైన వాటిలోని ఆఖరి రెండు సంగతులు చెప్పబడియున్నవి. అందులో "అన్నదమ్ములలో జగడములు పుట్టించువానిని" గూర్చి ఆఖరిగా చెప్పబడి యున్నది. ఈ మాటలను జాగ్రత్తగా పరిశీలించితే చాల విచారకరమైన సంగతిని గూర్చి తెలిసికొంటాము. "బుద్ధిపూర్వకముగా సహోదరులలో భేదాభిప్రాయములు, కలహములు, తగాదాలు కల్పించుటకు ప్రచారము చేయువానిని గూర్చి చెప్ప బడియున్నది. ఈ మాటలు వ్రాయక కొన్ని వచనములకు ముందు సొలొమోను పనికిమాలిన వానిని గూర్చి దుష్టుడైన వానిని గూర్చి 6:12-15లో చెప్పి యున్నాడు. ఇట్టివాడు దేవునికి అసహ్యుడంటే ఆశ్చర్యమేమైనా యున్నదా?

యిది చాల విచారకరము, గాని లోకంలో ఈ విధమైన ప్రవర్తన గల వారిని కనుగొనుట ఆశ్చర్యము కాదు, అయితే క్రీస్తుసంఘములో కూడ యిట్టి

వారున్నారు గనుక అది మరింత ఆందోళనకరము. మొదటి శతాబ్ధము నుండి యిట్టివారు సంఘములో యున్నారు. సహోదరులలో భేదములను, జగడములను పుట్టించువారి యొక్క పేళ్లను అపో.పౌలు, యోహాను కూడ తమ పత్రికలలో చెప్పియున్నారు.

పౌలు తిమోతికి హెచ్చరిక చేస్తు క్రైస్తవులందరు సత్యమును గ్రహించాలని, తెలిసికోవాలని, సత్యమునకు భిన్నమైన వాటిని మనస్కరింపరాదని చెప్పాడు. "వినువారిని చెరుపుటకే గాని మరిదేనికిని పనికిరాని మాటలను గూర్చి వాదము పెట్టుకొనవద్దని" హెచ్చరించాడు. "అపవిత్రమైన వట్టి మాటలకు విముఖుడవైయుండుము. అట్టి మాటలాడువారు మరి యెక్కువగా భక్తిహీనులగుదురు. కొరుకు పుండు ప్రాకినట్టు వారి మాటలు ప్రాకును. వారిలో హుమెనైయును, ఫిలేతును ఉన్నారు". (2తిమోతి 2:14-19).

తరువాత భక్తుడైన యోహాను గాయుయనకు వ్రాసిన పత్రికలో దియొత్రెఫే అను వానిని గూర్చి ప్రత్యేకముగా చెప్పాడు. "వాడు మమ్మును గూర్చి చెడ్డ మాటలు వదరుచు" సంఘములోనే కలతలు రేపుచున్నాడని తెలియజేసాడు. అతడు సంఘములో ప్రాముఖ్యతను కోరుచుండెను (3 యోహాను 1:9,10). దేవుని ప్రజల మధ్యనే చిచ్చుపెట్టడానికి ప్రయత్నించువాడని దేవుని గ్రంధములో చెప్పబడితే అది ఎంత ఘోరము!.

**క్రైస్తవులుగా మనం ఒకరి నొకరు ప్రోత్సాహించు కొనుటకు ప్రయత్నించాలి.**

ఒకరి నొకరు హెచ్చరించుకోవాలి. ఒకరికొకరు క్షేమాభివృద్ధి కలుగుజేసుకోవాలి. అందరము కలిసి పరలోకానికి వెళ్లాలి. క్రైస్తవ సోదర సోదరీలను నిరుత్సాహపరుటకు గాని,కించపరచడానికి గాని చూడ కూడదు. "మోసపోకుడి దేవుడు వెక్కిరింపబడడు; మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును. ఏలాగనగా తన శరీరేచ్ఛలను బట్టి విత్తువాడు తన శరీరము నుండి

క్షయమను పంటకోయును. ఆత్మను బట్టి విత్తువాడు ఆత్మ నుండి నిత్య జీవమను పంటకోయును. మనము మేలు చేయుట యందు విసుగక యుందము. మనము అలయక మేలు చేసితిమేని తగిన కాలమందు పంట కోతుము. కాబట్టి మనకు సమయము దొరికిన కొలది అందరి యెడలను, విశేషముగా విశ్వాసగృహమునకు చేరిన వారి యెడలను మేలు చేయుదము" (గలతీ 6:7-10).

సహోదరుల మధ్య జగడములు పుట్టించువాడు అందరి యెడల ఏ రకమైన మేలు చేయుటలేదు, సరిగదా అట్టి వారు తమ స్వార్థస్వభావమును, దేవుని వాక్యము యెడల నిర్లక్ష్య భావమును తెలుపుచున్నారు. "ఏలయనగా మత్సరమును వివాదమును ఎక్కడ ఉండునో అక్కడ అల్లరియు ప్రతి నీచకార్యమును ఉండును. అయితే పై నుండి వచ్చు జ్ఞానము మొట్టమొదట పవిత్రమైనది. తరువాత సమాధానకరమైనది, మృదువైనది, సులభముగాలోబడునది. కనికరముతోను మంచిఫలములతోను నిండుకొనినది. పక్షపాతమైనను వేషధారణయైనను లేనిదియునై యున్నది. నీతి ఫలము సమాధానము చేయువారికి సమాధానమందు విత్తబడును" (యాకోబు 3:16-18). "ప్రియులారా, మనము ఒకని నొకడు ప్రేమింతము, ఏలయనగా ప్రేమ దేవుని మూలముగా కలుగుచున్నది; ప్రేమించు ప్రతివాడును దేవుని మూలముగా పుట్టినవాడై దేవుని ఎరుగును, దేవుడు ప్రేమాస్వరూపి. ప్రేమ లేని వాడు దేవుని ఎరుగడు" (1 యోహాను 4:7,8).

దేవుని కుటుంబములో, సహోదరులుగా యుండుట, క్రీస్తు సంఘములో సభ్యులుగా యుండుట ఒక గొప్ప దీవెన.

మనం దేవుని వలన పెంచబడి, సంరక్షింపబడుచున్నాము. గనుక "సహోదరులు ఐక్యత కలిగి యుండుట ఎంత మేలు, ఎంత మనోహరము!" (కీర్తనలు 133:1).

- కోరి విల్సన్

# సంక్షిప్త వార్తలు

సత్యవాక్కు చదువరులకందరకీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయుచున్నాము. ఈ పత్రిక ద్వారా గత 41 సంవత్సరములలోను అనేక వేల గృహములను దర్శించే భాగ్యము మాకు దయచేసినందుకు దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. మీలో అనేకులు ఈ పని నిమిత్తమై అందించిన ప్రార్థన సహాయ సహకారముల కొరకు కృతజ్ఞులము. దేవుని చిత్తమైతే యేసుక్రీస్తు మరలవచ్చువరకు సత్యవాక్కు ముద్రణ, ప్రచురణ కొనసాగింపబడులాగున ప్రార్థించ మనవి.

2019 డిశంబరు 17,18 తేదీలలో కాకినాడ సత్యవాణి ఆవరణలో ఉత్తరాంధ్రజిల్లాల నుండి ప్రత్యేకముగా ఆహ్వానింపబడిన సువార్తికులకు రోనీగూటం గారి ఆధ్వర్యమున సువార్తికుల సదస్సు ఘనముగా జరిగెను. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుండి రెండువందలకు పైగా సువార్తికులు హాజరైరి.

ఆరెండు దినములలోను దేవుని గ్రంధము నుండి ఆశ్చర్యకరమైన సంగతులు బోధింపబడెను. సోదరులు రోనీ గూటం, ఆర్.సి. హెచ్. సద్గుణ రావ్, కె.లూకా, కె.తిమోతి మరియు జాషువా గూటం గార్లు చక్కటి విధముగా బోధించిరి. బైబిలును గూర్చి, క్రీస్తు యొక్క దైవత్వమును గూర్చి, క్రీస్తుసంఘము యొక్క విశిష్టత, దాని ఆరాధన వగయిరా అంశములు సవిస్తరముగా బోధింపబడెను. హాజరైనవారందరు ఈ పాఠములను తమ నోట్ పుస్తకములలో వ్రాసియుంచుకొనిరి.

హాజరైనవారందరికీ సేవలో పనికివచ్చు పుస్తకములు, కరపత్రికలు ఉచితముగా అందజేయబడెను. మరియు జెర్రీబేట్స్‌గారు వ్రాసిన బైబిలులోని మూడు ప్రాముఖ్యాంశములు అను పుస్తకము కూడ ఉచితముగా సరఫరా చేయబడెను. ఆ పుస్తకములో దైవత్వము, ఆరాధన, రెండు నిబంధనలు అను అంశములు సవిశేషముగా వివరించబడెను. 130 పేజీలు గల ఈ పుస్తకమును సత్యవాణి ఆఫీసుకు వ్రాసి గాని, ఫోన్‌చేసి గాని మీరు ఉచితముగా పొందవచ్చును. రిక్కీ గారు ఇశ్రాయేలు, యోర్దాను, ఐగుప్తుదేశములలో పర్యటించిన ఫోటోలను ప్రదర్శించి అందరినీ ఆనందపరచిరి.

ఇంచుమించు 43 సంవత్సరముల క్రితం రేడియో శ్రీలంక ద్వారా ప్రసారము చేయబడిన సత్యవాణి రేడియో కార్యక్రమములను ఇప్పుడు మీరు

ఇంటర్నెట్‌లో మరల వినవచ్చును. ఈ లింక్‌ను గూగుల్‌లో క్లిక్ చేయండి. http//radio.truthfm8000/telugu

2020 జనవరి రెండవ వారములో విజయనగరం జిల్లా, చీపురుపల్లిలో సువార్తికుల సదస్సు ఏర్పాటు చేయుటకు రోనీగూటం గారు ప్రయత్నం చేయుచున్నారు. ఆప్రాంతములో సువార్తికులు సత్యవాణి ఆఫీసుకు ఫోన్‌చేసి తెలిసికొనవచ్చును.

2020 ఫిబ్రవరి 7,8,9 తేదీలలో కాకినాడ సత్యవాణి-క్రీస్తు సంఘ ఆవరణలో **Lads to Leader** (బాలకుల నుండి పాలకుల వరకు) కన్వెషన్ జరుగును.యిది యువకులకు ఉద్దేశించబడిన కార్యక్రమము. గనుక మీ సంఘములలో యున్న యువతీ యువకులకు ఉద్దేశించబడిన కార్యక్రమము. గనుక మీ సంఘములలో యున్న యువతీ యువకులను పై తేదీలలో కాకినాడ వచ్చే లాగును సిద్ధపరచండి. గత సంవత్సరం 1500 మందికి పైగా హాజరైరి.

**RIN Regd. No. 69973/98**
**Postal Regd. No. AP/KD-02/2018-2020**

From :
SATYAVAKKU
P.O. Box 80, Kakinada - 533001

Date of Publication : 9th of Every Month
Date of Posting : 15th of Every Month

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004